విద్యా రంగానికి ప్రభుత్వం పెద్ద పీట

- ఎమ్మెల్యేలు రక్షణనిధి, వసంత కృష్ణప్రసాద్, మేకా ప్రతాప్ అప్పారావు
- అట్టహాసంగా జగనన్న ఆణిముత్యాలు పురస్కారాల ప్రదానం

తిరువూరు: విద్యా రంగానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యేలు కె.రక్షణనిధి, వసంత వెంకట కృష్ణప్రసాద్, మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో నియోజకవర్గ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం కింద విద్యార్థులకు నగదు పురస్కారాలను గురువారం అందజేసి సత్కరించారు. మూడు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు పాల్గొని పురస్కారాలను ప్రదానం చేశారు. తిరువూరు నియోజకవర్గ పరిధిలో తిరువూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహించడానికి జగనన్న ఆణిముత్యాలు పథకాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టిందని ఎమ్మెల్యే రక్షణనిధి తెలిపారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించడానికి అవసరమైన అన్ని సదుపాయాలను ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నామన్నారు. ప్రతి మండలంలో రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేసి విద్యార్థినులకు ప్రత్యేక కళాశాలలను ప్రారంభించామని చెప్పారు. కార్పొరేట్ కళాశాలల కంటే అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన అధ్యాపకులు ఈ కళాశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తారన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, ఎంపీపీలు భారతి, వనజాక్షి, శ్రీలక్ష్మి, నాగలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు రామచంద్రారెడ్డి, గన్యా, లోకేశ్వరరెడ్డి, శామ్యూల్, తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించడానికే జగనన్న ఆణిముత్యాలు

మైలవరం: నిరుపేద విద్యార్థులను ప్రోత్సహించడానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆణిముత్యాలు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలిపారు. మైలవరం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఎమ్మెల్యే విద్యార్థులకు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్‌లు అందజేసి, వారి తల్లి దండ్రులు, ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. నియోజకవర్గ స్థాయిలో 8 మంది విద్యార్థులకు లక్ష రూపాయలు అందజేశారు. పోటీ ప్రపంచంలో 95 శాతం మార్కులు సాధించాలని లక్ష్యంగా విద్యను అభ్యసించాలన్నారు. వెల్వడం ప్రముఖులు లకిరెడ్డి సోదరులు ఎంతో కష్టపడి శ్రమించి అమెరికా వెళ్లి అక్కడ స్థిరపడి ఎందరికో స్ఫూర్తిగా నిలిచారన్నారు. నేడు ఉన్నత స్థానాల్లో ఉన్న ఎందరో ఒకప్పుడు సర్కారు బడుల్లో చదివిన వారేనన్నారు. గతంలో సరైన సౌకర్యాలు లేవని, కానీ నేడు జగనన్న ప్రభుత్వంలో నాడు నేడుతో పాఠశాలలు అభివృద్ధితో పాటు అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక, వసతి దీవెన, విద్యా దీవెన ఇలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రత్న శ్యామ్‌బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నూజివీడులో మెడల్స్ అందజేత

నూజివీడు: మండల పరిధిలోని మీర్జాపురం హైస్కూల్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు గురువారం బహుమతులు, మెడల్స్‌ను, సర్టిఫికెట్లను అందజేశారు. ఎ.భవానీశంకర్, వై.హర్షిత్, పి.చంద్రిక తొలి స్థానాల్లో నిలిచారు. కార్యక్రమంలో హెచ్ఎం డీఎల్ పుష్పలత, దండుబోయిన రవి, గోళ్ల వెంకటేశ్వరరావు, జోడి ప్రభాకర్ రావు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.నరసింహారావు పాల్గొన్నారు. గొల్లపల్లి జెడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన జాజుల ధనుష్, బండి మహేంద్ర, చల్లారి గోత్రికలను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, సర్పంచ్ బొకినాల వెంకటేశ్వరమ్మ ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



తిరువూరులో ఆణిముత్యాలు పురస్కారం అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నాయకులు



మైలవరంలో చెక్కు, జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నేతలు

విద్యతోనే రాష్ట్రం రూపురేఖలు మారతాయి

నూజివీడు: విద్యతోనే సమాజంలోని అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో గురువారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో 11 మంది విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నిలబెట్టిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంను ప్రవేశపెడుతుంటే వ్యతిరేకిస్తూ న్యాయస్థానాలకు వెళ్లిన ఘనత చంద్రబాబుదని ధ్వజమెత్తారు. ఆణిముత్యాలుగా ఎంపికైన విద్యార్థులను స్ఫూర్తిగా తీసుకొని వచ్చే ఏడాది మరింత మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. డీవైఈఓ సేవియా, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ, వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కోటగిరి రాజా నాయన, మండల అధ్యక్షుడు ముల్పూరి నాగమల్లేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు లాం ప్రసాదరావు, జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం భాగవతుల హేమలత తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో నేతలు దేశిరెడ్డి రాఘవరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, కోటగిరి పూర్ణిమ, ప్రిన్సిపాల్స్ వై.శ్రీదేవి, వీవీఎస్ సత్యనారాయణ, ఎంఈవోలు వెంకటేశ్వర్లు, రత్నకుమార్, ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.



నూజివీడులో పురస్కారాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు, నాయకులు

సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఏ.కొండూరు: గ్రామ సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కె.రక్షణనిధి చెప్పారు. మండలంలోని చీమలపాడు గ్రామంలో రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయాల వ్యవస్థను ప్రవేశపెట్టి ప్రజల ఇళ్ల వద్దే ప్రభుత్వ సేవలను అందజేస్తున్నారన్నారు. సచివాలయ నిర్మాణానికి స్థలాన్ని అందజేసిన శెట్టిపల్లి లక్ష్మీ వెంకాయమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు స్థల దాత ఎస్‌వీఎస్ పిచ్చియ్యరావును ఎమ్మెల్యే సన్మానించారు. రూ.40 లక్షల విలువైన పది సెంట్ల స్థలం ఇవ్వడం అభినందనీయమన్నారు. వలంటీర్ల ద్వారా అర్హులందరికీ ఎవరి సిఫార్సులు లేకుండా గ్రామ సచివాలయాల ద్వారా సంక్షేమ పథకాలను మంజూరు చేస్తున్నామని చెప్పారు. గ్రామంలో పలు అభివృద్ధి పనులకు రూ.2.71 కోట్లు మంజూరు చేశామన్నారు. కిడ్నీ ప్రభావిత ప్రాంతాల్లో నాలుగు వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాక్టర్ల ద్వారా కృష్ణా జలాలు అందిస్తున్నామన్నారు.

టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు..

జల్ జీవన్‌మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. శాశ్వత పరిష్కారానికి రూ.48 కోట్లతో కృష్ణా జలాలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, డయాలసిస్ రోగులకు ప్రతి నెల రూ.10 వేలు పింఛన్, ఉచితంగా మందులను స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేసి డయాలసిస్ చేయిస్తున్నామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం కనీసం పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి, జెడ్పీటీసీ భూక్యా గనియా, వైస్ ఎంపీపీ గుంటక శివారెడ్డి, సర్పంచ్ మోర్ల లక్ష్మి, సాంబయ్య, ఎంపీటీసీ కోలా నాగమణి, పీఏసీఎస్ చైర్మన్లు జి.వెంకట్రావు, ఏ.వెంకటరెడ్డి, టి.వెంకటేశ్వరరెడ్డి, నాయకులు ఎస్కే అమీన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ నాగకృష్ణ, ఏ.శ్రీనివాసరావు, పిచ్చియ్యరావు, కె.చెన్నారావు, సతీష్, పి.వడ్డికాసులు, ఎంపీడీవో నాగేశ్వరరావు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



స్థల దాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, నేతలు

ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

కవులూరు(ఇబ్రహీంపట్నం): లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సబ్‌కలెక్టర్ అదితి సింగ్ ఆదేశించారు. జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామంలో జగనన్న లేఅవుట్‌ను ఆమె గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా లేఅవుట్‌లో పూర్తయిన ఇళ్లు, నిర్మాణంలో ఉన్న ఇళ్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తయిన ఇళ్ల లబ్ధిదారులతో గృహ ప్రవేశాలకు చర్యలు తీసుకోవాలన్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణాలపై లబ్ధిదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో గృహ నిర్మాణ శాఖ అధికారులు పాల్గొన్నారు.



కవులూరులో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అదితి సింగ్, అధికారులు

సర్పంచ్ వాణికి అభినందనలు

ముసునూరు: జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సభ్యురాలిగా తనను నియమించినట్లు గోపవరం సర్పంచ్ కంచర్ల వాణి తెలిపారు. బుధవారం కమిటీ చైర్మన్, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో తనను జిల్లా కమిటీలో సభ్యురాలిగా నియమించారన్నారు. మహిళల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఆమెను ఎమ్మెల్యే మేకా ప్రతాప్, జెడ్పీటీసీ ప్రతాప్, ఎంపీపీ కృష్ణ కుమారి సుబ్బారావు, వైస్ ఎంపీపీలు రాజానాయన, గంగాధర్, కోటగిరి గోపాలకృష్ణ, నాగ వల్లేశ్వరరావు, గోపి, ఎంపీటీసీలు వెంకమ్మ, ఖాలీషా మస్తాన్‌వలి అభినందించారు.

చిన్నారుల అభివృద్ధికి అంగన్‌వాడీలు కృషి చేయాలి

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: అంగన్‌వాడీ కేంద్రాలు ఆటపాటలతో కూడుకున్న అమ్మఒడి లాంటివని, చిన్నారుల అభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని మీటింగ్‌హాల్‌లో గురువారం అంగన్‌వాడీ జన్ బాగీదారి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ అంగన్‌వాడీ వర్కర్లు స్టాల్స్‌లో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించారు. గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. మూడేళ్లు పైబడిన చిన్నారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండాలన్నారు. చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో చదువు నేర్పించడంతో పాటు, వారి ఎదుగుదలకు పౌష్టికాహారం అందిస్తారని చెప్పారు. ఐసీడీఎస్ ఏలూరు పీడీ పద్మావతి మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే అంగన్‌వాడీ కేంద్రాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీపీ విజయ్‌కుమార్, సీడీపీవో నూరాణి, ఏసీడీపీవో నాగేశ్వరి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లోనే మానసిక వికాసం

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): అంగన్‌వాడీ కేంద్రాల్లో మానసిక బుద్ధి వికాసం, ప్రాథమిక విద్య అలవర్చుకుంటారని కేతనకొండ సచివాలయం మహిళా పోలీస్ సునీత అన్నారు. కేంద్ర విద్యా విధానం 2020 అనుసరించి జన్ బాగీదారి కార్యక్రమంలో భాగంగా చిన్నారుల తల్లిదండ్రులకు ప్రాథమిక విద్యపై గురువారం అవగాహన కల్పించారు. ఆటపాటలతో కూడిన ప్రాథమిక విద్య కోసం చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కరపత్రాలు ఆవిష్కరించి పంపిణీ చేశారు. అంగన్‌వాడీలు, ఆశాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్‌పై అవగాహన

తిరువూరురూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ తరగతుల నిర్వహణపై గురువారం పిల్లల తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆటపాటలతో బోధన అందిస్తున్న విధానంతో త్వరగా పిల్లలు అవగాహన చేసుకుంటారని, ప్రైవేటు పాఠశాలల కంటే దీటుగా తరగతులు బోధిస్తామని అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. జన్ బాగీదారి కార్యక్రమంలో భాగంగా తల్లులకు పీపీ1, పీపీ 2 పుస్తకాలను చూపి అవగాహన కల్పించినట్లు అంగన్‌వాడీ కార్యకర్తలు తెలిపారు. మల్లేల, కాకర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళా సంరక్షణ కార్యదర్శులు విజయలక్ష్మి, సైదాబీ, కార్యకర్తలు శైలజ, ధనలక్ష్మి పాల్గొన్నారు.



నూజివీడులో అంగన్‌వాడీ చిన్నారుల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



కేతనకొండలో కరపత్రాలు ఆవిష్కరించిన మహిళా పోలీస్ సునీత, అంగన్‌వాడీలు

భూసార పరీక్షలు తప్పనిసరి

తిరువూరు: ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు చేసే రైతులు ముందుగా భూసార పరీక్షలను తప్పనిసరిగా చేయించుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. భూసారానికి అనుగుణంగా మాత్రమే పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. అన్నదాతలు రైతు భరోసా కేంద్రాల్లో మట్టి నమూనాలు అందజేయాలని కోరారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

తిరువూరురూరల్: పదో తరగతి, ఇంటర్మీడియెట్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు తిరువూరు నియోజకవర్గ యాదవ సంక్షేమ సంఘం గురువారం నగదు ప్రోత్సాహకాలను అందజేసింది. బోగినబోయిన శివసాయిరాం(సూరవరం), మరసకట్ల జెస్సీ(పోలిశెట్టిపాడు)లకు సంఘ అధ్యక్షుడు వాకదాని లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు కందుల విజయకుమార్, దుర్గాభవాని నగదును అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తమ సంఘం సాయం అందజేస్తోందని ఆయన తెలిపారు.

ప్రహరీ నిర్మాణం ప్రారంభం

నూజివీడు: ఆగిరిపల్లి కనకదుర్గమ్మవారి ఆలయ ప్రహరీ నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. సర్పంచ్ చొటపల్లి లక్ష్మి విక్టర్‌బాబు హిందూ శ్మశాన వాటిక అభివృద్ధి కమిటీ చైర్మన్ పొన్నం లక్ష్మణరావు సారథ్యంలో ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎంపీపీ గోళ్ల అనూష, జెడ్పీటీసీ పిన్నిబోయిన వీరబాబు, ఎంపీటీసీ సాధం గోపీనాథ్, నేతలు చిమటా శ్రీనివాసరావు, పలగాని నరసింహారావు, మచ్చా హరిబాబు, పామర్తి నరసింహారావు, షేక్ నాగుల్‌మీరా, నక్కనబోయిన శ్రీమన్నారాయణ, వాకా సక్కేశ్వరరావు పాల్గొన్నారు.

రుణ అర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోండి

చాట్రాయి: కౌలు రైతులు రుణ అర్హత కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి బి.శివ శంకర్ గురువారం పేర్కొన్నారు. ఆధార్ కార్డు, తగిన ధ్రువీకరణ పత్రాలను వీఆర్వో లేదా గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌కు అందజేసి కౌలు రుణ అర్హత కార్డు పొందాలన్నారు. రుణ అర్హత కార్డు ఉన్న కౌలు రైతులకు వైఎస్సార్ రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పంట నష్ట పరిహారం అందిస్తామని చెప్పారు.

19న వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు సెలక్షన్స్

జి.కొండూరు(ఇబ్రహీంపట్నం): కడప జిల్లాలో డాక్టర్ వైఎస్సార్ స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాలకు ఈనెల 19న జి.కొండూరు జెడ్పీ పాఠశాలలో సెలక్షన్స్ ట్రయల్స్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో అనూరాధ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతిలో బాలికలు 20, బాలురు 20 ఖాళీలు ఉన్నాయన్నారు. 30 మీటర్ల ఫ్లయింగ్ స్టార్ట్స్, స్టాండింగ్ బోర్డ్ జంప్, స్టాండింగ్ వర్టికల్ జంప్, 800 మీటర్ల పరుగు, తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు జనన ధ్రువీకరణ, బదిలీ, స్టడీ, స్థానికత, ప్రవర్తన సర్టిఫికెట్లతో 19న ఉదయం హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు ఎంపీపీ, ఎంపీడీవో, ఎంఈవో, హెచ్ఎంలను సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

శ్రీశ్రీ కవిత్వం అజరామరం



తిరువూరు: ప్రజా సమస్యలను తన రచనల ద్వారా సమాజానికి తెలియజేసిన అభ్యుదయ రచయిత మహాకవి శ్రీశ్రీ అని తిరువూరు సుందరయ్య విజ్ఞాన కేంద్ర కన్వీనర్ కడిమి పాపారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో గురువారం శ్రీశ్రీ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ వర్ధంతి నిర్వహించారు. అణగారిన వర్గాల పక్షాల నిలబడి అభ్యుదయ వాదిగా పేరుగాంచిన శ్రీశ్రీ తెలుగు సాహితీలోకంలో ధ్రువతారగా మిగిలిపోయారన్నారు. శ్రీశ్రీ చిత్రపటానికి అధ్యయన వేదిక సభ్యులు పంతంగి శ్రీనివాసరావు, పి.శోభన్‌బాబు, గంగాధర్, రంగారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మత సామరస్యానికి ప్రతీక షాబూఖారీ దర్గా అని కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ టిప్పుసుల్తాన్ దర్గా కమిటీ చైర్మన్ ఆసీఫ్ సేట్ మేమన్ అన్నారు. కొండపల్లిలోని షాబూఖారీ దర్గాను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆస్థాన పీఠాధిపతి, మత గురువు మహ్మద్ అల్తాఫ్‌రజా ఆయనకు ఘన స్వాగతం పలికారు. మైసూర్ నుంచి తెచ్చిన చాదర్‌ను బాబాకు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంతో ప్రసిద్ధి గాంచిన దర్గా సందర్శించడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడ జరుగుతున్న నిత్యాన్నదానం ఎంతో గొప్పదన్నారు. మహ్మద్ సుభాని, జాకీర్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

నూజివీడు: మండలంలోని గొల్లపల్లి రఘునాథస్వామి ఆలయానికి చెందిన పోలసానపల్లిలోని 3.09 ఎకరాలను మూడేళ్ల కాల పరిమితికి సాగు నిమిత్తం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు గురువారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఆలయ ఆవరణలో దేవదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి హుండీ కానుకల ఆదాయాన్ని లెక్కిస్తామని చెప్పారు.

ఆగిరిపల్లి హెచ్‌ఓగా జ్యోతి ప్రియాంక



నూజివీడు: ఆగిరిపల్లి మండల ఉద్యాన అధికారిగా కాళీదాసు జ్యోతి ప్రియాంక గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు తొలి పోస్టింగ్ ఇదే. ఏలూరు జిల్లా దెందులూరు మండలం వేగవరం గ్రామానికి చెందిన ఆమె తాడేపల్లిగూడెం వైఎస్సార్ ఉద్యానవన యూనివర్సిటీలో బీఎస్సీ హార్టికల్చర్ కోర్సును 2019లో పూర్తిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన రిక్రూట్‌మెంట్‌లో ఎంపికై ఆగిరిపల్లి ఉద్యాన అధికారిగా నియమితులయ్యారు.

నేడు రాజులపాలెం, ఊటుకూరుల్లో 'గడప గడపకు మన ప్రభుత్వం'

ఊటుకూరు(గంపలగూడెం): ఊటుకూరు సచివాలయం-1 పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో .పిచ్చిరెడ్డి తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే కె.రక్షణనిధి పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సాయిపురం ఫీడర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



పొందుగల(మైలవరం): మండల పరిధిలోని పొందుగల గ్రామానికి చెందిన బెజవాడ వెంకట శివ నాగరాణికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.1.40 లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ.. అనారోగ్యంతో, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న వారిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదుకుంటూ నేనున్నానంటూ చేయూతనిస్తున్నారన్నారు. శివ నాగరాణి ఇటీవల మోకాళ్లకు శస్త్రచికిత్స జరగడంతో సీఎంఆర్ఎఫ్ మంజూరైంది. కార్యక్రమంలో ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి, సర్పంచ్ కోటమ్మ, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తిరుపతిరావు, వైఎస్సార్ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, మాజీ సర్పంచ్‌లు డొంకెన చలపతిరావు, బొడ్డపాటి రాజా, గ్రామస్తులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన ఉపాధి హామీ ఉద్యోగులు



ఇబ్రహీంపట్నం: ఉపాధిహామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని గురువారం మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసినట్లు మండల ఏపీఎం మాధవరెడ్డి తెలిపారు. ఉపాధి హామీ పథకం సిబ్బందిగా గతంలో ఏవిధంగా నియమించబడ్డారనే అంశంపై సజ్జల ఆరా తీశారన్నారు. క్రమబద్ధీకరణకు అవసరమైన అంశాలను ఉపాధిహామీ జేఏసీ రాష్ట్ర యూనియన్ నాయకులు వి.వెంకటేశ్వరరావు, ఏ.భాస్కర్, కిరణ్‌కుమార్ వివరించారని చెప్పారు. క్రమబద్ధీకరణ జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. వివిధ మండలాల ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

మైలవరం/తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సమస్యలు తెలుసుకుని, సలహాలు స్వీకరించడానికి శుక్రవారం డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వేణు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు 99592 25465 మొబైల్ నంబర్‌కు ఫోను చేసి తమ సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ముసునూరు: మద్యం మత్తులో పురుగు మందు తాగి, ఆస్పత్రి పాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. మండలంలోని చెక్కపల్లికి చెందిన చిమట తిరుపతిరావు(45) మద్యానికి బానిసగా మారాడు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో బుధవారం అర్ధరాత్రి మొక్కలకు వాడగా, మిగిలిన పురుగుల మందును సేవించాడు. నూజివీడు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించామని ఎస్ఐ తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం)/నూజివీడు: మున్సిపల్ కార్యాలయ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కార్మికులు కొండపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. నూజివీడులో మున్సిపల్ మేనేజర్ కె.మనోజకు కార్మికులు వినతిపత్రం అందజేశారు.